



# కెరటం న్యూస్

( సామాన్యుడి ఆయుధం )

శుక్రవారం 08, డిసెంబర్ 2023 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన మీడియా సంస్థ








## విక్రమార్కుడు

- డిప్యూటీ సీఎంగా భట్టి విక్రమార్క
- ఖమ్మం జిల్లాకు అరుదైన గౌరవం.. నాడు ముఖ్యమంత్రి, నేడు ఉప ముఖ్యమంత్రి

ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్

**ఖమ్మం జిల్లాకు అరుదైన** గౌరవం లభించింది. జిల్లా చరిత్రలో కాంగ్రెస్ పార్టీ తరపున ఒక నేత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగా, నేడు అదే పార్టీ తరపున మరొకరు ఉప ముఖ్యమంత్రిగా తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో బాధ్యతలు నిర్వర్తించబోతున్నారు. రాష్ట్ర ఐదవ ముఖ్యమంత్రిగా ఖమ్మం జిల్లాకు చెందిన జలగం వెంగళరావు 1973 నుంచి 1978 వరకు పని చేశారు. ఆయన సాధారణ కార్యకర్త నుంచి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన నేత. అలాగే తాజాగా జరగబోయే తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ ప్రమాణ స్వీకార మిగతా 2లో..

## పొలిటికల్ లెజెండ్
## మంత్రి తుమ్మల

- నాలుగు దశాబ్దాల మచ్చ లేని రాజకీయ చరిత్ర
- ఖమ్మంలో తుమ్మలది ప్రత్యేక స్థానం
- ఖమ్మంలో మాజీ మంత్రి పువ్వాడను చిత్తుగా ఓడించి తన సత్తా చాటిన ఉద్దండుడు

ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:

**ఖమ్మం జిల్లా రాజకీయాల్లో** తుమ్మలది విశిష్ట స్థానంగానే చెప్పాలి. నాలుగు దశాబ్దాల రాజకీయ చరిత్ర కలిగిన తుమ్మల నేటికీ మచ్చ లేని నేతగా కొనసాగుతున్నారు. నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించిన రోజుల్లో ఆయన వెన్నంటే ఉన్న తుమ్మల క్రియాశీలకంగా పని చేశారు. తన అనుచరులను ఎంద రినో నాయకులుగా తీర్చిదిద్దారు. 1982 సెప్టెంబరులో చర్ల మండలం ఏటుపాక గ్రామంలో జరిగిన ఓ కార్యక్రమంలో మిగతా 2లో..

## దటీజ్ పొంగులేటి

- పదేళ్ల రాజకీయం.. రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం
- నాడు పార్లమెంటులో ఉత్తమ ఎంపీగా ప్రశంసలు
- నేడు అనతి కాలంలోనే అమాత్యుడు..
- అమాంతం పెరిగిన పొంగులేటి బ్రాండ్

ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్

**గురువారం హైదరాబాదు** లాల్ బహదూర్ స్టేడియంలో జరిగిన మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని పరిశీలించిన వారికి ఒక విషయం గుర్తుండిపోతుంది. చీఫ్ సెక్రటరీ శాంతి కమారి పొంగు లేటి శ్రీనివాస రెడ్డిని ప్రమాణస్వీకారానికి పిలవగానే స్టేడియం మొత్తం కేరింతలు, నినాదాలతో హోరెత్తింది. అంటే ఖమ్మంలోనే కాదు రాష్ట్ర రాజధానిలోనూ పొంగులేటి పేరు మార్మోగి మిగతా 2లో..

## ఖర్గే, సోనియాకు స్వాగతం పలికిన
# డిప్యూటీ సీఎం భట్టి

- భట్టి విక్రమార్కకు అభినందనలు తెలిపిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, వీరయ్య
- ప్రమాణ స్వీకారం ముందు ఇంట్లో దంపతుల పూజలు

ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్

**తెలంగాణ మంత్రి** మండలి ప్రమాణ స్వీకారోత్సవానికి హైదరాబాద్ విచ్చేసిన ఏఐసిసి అధ్యక్షులు, గౌరవనీయులు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అధినేత్రి శ్రీమతి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ లకు తాజ్ కృష్ణ హోటల్ వద్ద గురువారం మిగతా 2లో..





## పార్లమెంట్ సాక్షిగా రైతు చట్టాలపై పోరాడా..

- పార్లమెంట్ అఖిల పక్ష సమావేశం లోనూ ప్రస్తావించా: నామ

3వ పేజీలో..

# విక్రమార్కుడు



(మొదటిపేజీ తరువాయి..)

వేడుకలోనూ మధిర ఎమ్మెల్యే మల్లు విక్రమార్క రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టబోతున్నారు. హైదరాబాదులోని ఎల్బి స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర 2వ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపడుతున్న క్రమంలోనే ఉప ముఖ్యమంత్రిగా మధిర శాసన సభ్యుడు భట్టి విక్రమార్క పదవీ బాధ్యతలు స్వీకరించడం విశేషం. ఈ పరిణామం తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఖమ్మం జిల్లాకు అరుదైన గౌరవాన్ని తెచ్చిపెట్టింది.

**భట్టి విక్రమార్క ప్రొఫైల్..**

ప్రస్తుతం భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తరపున ఖమ్మం జిల్లా మధిర అసెంబ్లీ నియోజకవర్గం శాసన సభ్యుడిగా నాలుగవ సారి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

2009, 2014, 2018, 2023 ఎన్నికలలో శాసనసభ సభ్యునిగా ఎన్నికయ్యాడు.

2009 నుండి 2011 వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చీఫ్ విప్‌గా ఉన్నారు.

2011 నుండి 2014 వరకు ఆంధ్రప్రదేశ్ శాసనసభకు డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

2019 నుండి 2023 వరకు తెలంగాణ కాంగ్రెస్ శాసనసభ పక్ష నేతగా వ్యవహరించారు.

డైరెక్టర్, ఆంధ్రాబ్యాంక్

పిసిసి కార్యనిర్వాహక సభ్యుడు (1990%--92)

పిసిసి కార్యదర్శి (2000%--2003)

2007లో ఖమ్మం జిల్లా నుంచి ఎమ్మెల్సీగా గెలుపొందారు.

జననం..: 1961 జూన్ 15, స్నానాల లక్ష్మీపురం గ్రామం, వైరా మండలం, ఖమ్మం జిల్లా,

తల్లిదండ్రులు: అఖిలాండ, మాణిక్యమ్మ

జీవిత భాగస్వామి: నందిని

సంతానం: సూర్య విక్రమాదిత్య, సహేంద్ర విక్రమాదిత్య

భట్టి విక్రమార్క సోదరుడు మల్లు అనంత రాములు నాగర్‌కర్నూల్ లోకసభ నియోజకవర్గం మాజీ పార్లమెంటు సభ్యుడు, మాజీ పీసీసీ అధ్యక్షుడు. కాగా, మరో అన్న మల్లు రవి మాజీ పార్లమెంటు సభ్యుడు, శాసనసభ సభ్యుడు.

విక్రమార్క హైదరాబాదులోని కళాశాల నుండి గ్రాడ్యుయేషన్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాడు.

పాదయాత్ర: మల్లు భట్టి విక్రమార్క 2023 మార్చి 16న ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ నియోజకవర్గ పిప్పిరి గ్రామం నుంచి 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర ప్రారంభించి రాష్ట్రంలోని 17 జిల్లాలు, 36 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 1,365 కిలో మీటర్లు పూర్తి చేసి పాదయాత్రకు గుర్తుగా ఖమ్మం రూరల్ మండలంలోని తల్లంపాడు దగ్గర పైలాన్ ను ఆవిష్కరించి ముగింపు సందర్భంగా ఖమ్మంలో 2023 జులై 2న రాహుల్ గాంధీ ముఖ్యఅతిథిగా జన గర్జన సభను నిర్వహించారు.

# పొలిటికల్ లెజెండ్ మంత్రి తుమ్మల



(మొదటిపేజీ తరువాయి..)

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ సమక్షంలో ఆయన పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. ఆయనకు రాజకీయ జన్మనిచ్చింది సత్తుపల్లి నియోజకవర్గం. పూర్వ సత్తుపల్లి నియోజకవర్గంలోని దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలో 1953 నవంబర్ 15వ తేదీన జన్మించిన ఆయన తన రాజకీయాలను అక్కడి నుంచే ప్రారంభించారు. తెలుగుదేశం స్థాపించిన తర్వాత జరిగిన తొలి ఎన్నికల్లోనే ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఆయన ఓటమి చవిచూశారు. మళ్లీ ఏడాదిన్నరకే 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో విజయం సాధించారు. అప్పుడే ఆయనకు ఎన్టీఆర్ కేబినెట్ ర్యాంకు ఇచ్చారు. ఆయన 1985, 1994, 1999, 2009 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నుంచి 2016లో టీఆర్ఎస్ పార్టీ నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 2015లో శాసన మండలికి ఎన్నికయ్యారు. 2004 ఎన్నికల్లో సత్తుపల్లి నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2009 ఎన్నికల్లో ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసి గెలుపొందారు. 2014లో జరిగిన ఎన్నికల్లో కూడా టిడిపి నుండి పోటీ చేసి ఓడిపోయారు. 2014లో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీలో చేరారు. అనంతరం ఆయనకు టీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీగా అవకాశం కల్పించింది. కేసీఆర్ మంత్రివర్గంలో ఆయన ఆర్అండ్‌బీ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రిగా భాద్యతలు నిర్వహించారు. 2016లో పాలేరు ఉప ఎన్నికలో పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సుచరితపై 45,684 ఓట్ల మెజారిటీతో గెలిచారు. 2018లో జరిగిన ముందస్తు ఎన్నికల్లో పాలేరు నియోజకవర్గం నుంచి టీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు.

**కాంగ్రెస్‌లో ప్రస్థానం..**

తుమ్మల నాగేశ్వరరావు 2023 సెప్టెంబర్ 14న బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రాజీనామా లేఖను పంపించారు. హైదరాబాద్ వేదికగా హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణాలో జరుగుతున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనను 2023 తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రకటించిన రెండో జాబితాలో ఖమ్మం అభ్యర్థిగా ప్రకటించింది.

**మంత్రిగా ప్రయాణం..**

తుమ్మల నాగేశ్వరరావు 1985 నుంచి 1988 వరకు ఎన్టీఆర్ మంత్రివర్గంలో చిన్ననీటి పారుదల శాఖ మంత్రిగా, 1994 నుంచి 1999 వరకు ఎన్టీఆర్, చంద్రబాబుల మంత్రివర్గంలో చిన్ననీటి పారుదల, ఎక్సైజ్ శాఖ మంత్రిగా, 1999 నుంచి 2004 వరకు చంద్రబాబు మంత్రివర్గంలో భారీ నీటి పారుదల, రోడ్లు, భవనాల శాఖల మంత్రిగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ మంత్రివర్గంలో 2015 నుంచి 2018 వరకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, రోడ్లు, భవనాల శాఖల మంత్రిగా పనిచేసారు. తాజాగా ఆరోసారి ఎమ్మెల్యేగా ఎన్నిమైన ఆయనకు రేవంత్ రెడ్డి మంత్రి వర్గంలో చోటు దక్కింది.

# ఖర్గే, సోనియాకు స్వాగతం పలికిన డిప్యూటీ సీఎం భట్టి

(మొదటిపేజీ తరువాయి..)

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఘనంగా స్వాగతం పలికారు. తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం గా పదవీ బాధ్యతలు ఇచ్చినందుకు వారికి శాలువా కప్పి పుష్ప గుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

**దేవుడి గదిలో వైఎస్ చిత్రపటానికి పూజలు..**

ప్రమాణస్వీకారోత్సవానికి బయలుదేరే ముందు భట్టి విక్రమార్క మల్లు దంపతులు తన నివాసంలోని పూజ గదిలో ఈరోజు ఉదయం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తనకున్న గురుభక్తిని చాటుకున్నారు.

**భట్టి విక్రమార్కను కలిసి అభినందనలు తెలిపిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

హైదరాబాద్ ఎల్బి స్టేడియంలో డిప్యూటీ సీఎం గా ప్రమాణ స్వీకారం చేయనున్న భట్టి విక్రమార్కని ఆయన నివాసంలో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, భద్రాచలం మాజీ శాసనసభ్యులు పొదెం వీరయ్య కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు.

ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు వెల్లివెత్తిన అభినందనలు భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తున్నారని తెలియడంతో ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పెద్ద ఎత్తున హైదరాబాద్ బంజారాహిల్స్ లోని ఆయన నివాసానికి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వేల మంది కార్యకర్తలు తల్లి రావడంతో భట్టి నివాసం కిటకిటలాడిపోయింది. పండుగ వాతావరణం తలపించేలా సందడి వాతావరణం నెలకొన్నది. ఇంటి ముందు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేసి కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. పలువురు నాయకులు కార్యకర్తలు శాలువాలు కప్పి పుష్ప గుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

# దటీజ్ పొంగులేటి..

(మొదటిపేజీ తరువాయి..)

పోయిందన్న మాట. కేవలం పదేళ్ల రాజకీయం అంతలోనే రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం... నాడు రాజకీయాల్లో అడుగుపెట్టి కేవలం 14 నెలల్లోనే భారతదేశ అత్యున్నత చట్ట సభగా చెప్పుకునే పార్లమెంట్లో అడుగుపెట్టిన నైజం... అంతే కాదు తాను ఎంపీగా పనిచేసిన ఐదేళ్ల కాలంలో తన బాధ్యతల్లో పార్లమెంట్లో 100శాతం నిధులను సద్వినియోగం చేసి ఉత్తమ ఎంపీగా చరిత్ర సృష్టించిన నేర్పరితనం పొంగులేటి సొంతం...దటీజ్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి.

**పోరాటం అయన నైజం..**

పదేళ్ల రాజకీయ నేపథ్యం ఆయన్ని తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించింది. 2013లో రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి 2023లో రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టడం విశేషం.

ఖమ్మం జిల్లా కల్లూరు మండలం నారాయణపురం గ్రామంలో 1965 అక్టోబర్ 28వ తేదీన జన్మించిన పొంగులేటి అనతి కాలంలోనే జిల్లా రాజకీయాల్లో కీలక నేతగా ఎదిగారు. అంతేకాదు.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు సవాల్ విసిరి నిరంతరం వార్తల్లో వ్యక్తిగా మారారు. టీఆర్ఎస్ పార్టీని వీడిన తర్వాత ఖమ్మం జిల్లాలో పది నియోజకవర్గాల గెలుపు బాధ్యతను తన భుజస్కంధాలపై వేసుకున్నారు. ఏ ఒక్క టీఆర్ఎస్ అభ్యర్థిని అసెంబ్లీ గేటు తాకనివ్వనని శపథం చేసి నెగ్గారు కూడా.. బడా కాంట్రాక్టర్ గా వివిధ రాష్ట్రాల్లో పెద్ద పెద్ద పనులు నిర్వహించే పొంగులేటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013లో వైఎస్ఆర్ సీపీ పార్టీలో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 2014లో వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థిగా ఖమ్మం నుంచి లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందారు. ఆ తర్వాత రాజకీయ సమీకరణాల నేపద్యంలో టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సమితి)లో చేరారు. 2018 సార్వత్రిక ఎన్నికల్లో టీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమలరాజుకు మద్దతుగా నిలిచారు. ఈ ఎన్నికల్లో ఆయనకు ఎంపీగా పోటీ చేసే అవకాశం దక్కలేదు. దీంతో ఐదేళ్లపాటు ఎంతో సహనంగా టీఆర్ఎస్ లోనే కొనసాగారు. 2023లో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. అనంతరం 2023 జూలై 2న రాహుల్ గాంధీ సమక్షంలో ఖమ్మంలో జరిగిన 'తెలంగాణ జన గర్జన' బహిరంగ సభలో కాంగ్రెస్‌లో చేరారు. పొంగులేటి కాంగ్రెస్ లో చేరినప్పటి నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ నే టార్గెట్ గా ఎంచుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై బాణాలు ఎక్కుపెట్టారు. దీంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాలపై పట్టు సాధించి ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థులు విజయం సాధించేలా ప్రణాళికలు రచించారు. జిల్లాకు చెందిన సీనియర్ నేత, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం పార్టీలో చేరడంతో వీరిద్దరికీ జోడీ కుదిరింది. ఈ ఫలితంగా తాజా ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది స్థానాల్లో 9 స్థానాల్లో కాంగెస్ అభ్యర్థులు విజయం సాధించారు. దీంతో అప్రయత్న పూర్వకంగానే రేవంత్ రెడ్డి మంత్రి వర్గంలో పొంగులేటికి చోటు లభించింది.

# పార్లమెంట్ సాక్షిగా రైతు చట్టాలపై పోరాడా..

## పార్లమెంట్ అఖిలపక్ష సమావేశంలోనూ ప్రస్తావించా: నామ

న్యూఢిల్లీ బ్యూరో, కెరటం న్యూస్

వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకువచ్చేలా కేంద్ర ప్రభుత్వం పై వత్తిడి తీసుకువస్తానని బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు గురువారం న్యూఢిల్లీలో ఖమ్మం నుంచి వెళ్లిన ప్రతినిధి బృందానికి స్పష్టం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నేతృత్వంలోని ప్రతినిధి బృందం గురువారం న్యూఢిల్లీలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావును కలిసి మెమోరాండం అందజేసింది. ఈ సందర్భంగా ఎంపీ నామ మాట్లాడుతూ తాను రైతు బిడ్డనని, వ్యవసాయం కోసం రైతు, కూలీలు ఎంత కష్ట పడతారో తాను ఎంతో దగ్గరగా చూశానన్నారు. అప్పులు చేసి,తీర్చలేక ఆత్మ హత్యలు చేసుకునే వారని అన్నారు. అందుకే పార్లమెంట్ లో ఎన్నో సార్లు రైతు వ్యతిరేక చట్టాలను , మోటార్లకు మీటర్లను అడ్డుకోవడం జరిగిందని గుర్తు చేశారు. దేశానికి వెన్నుముకైనా అన్నదాతల సమగ్ర వ్యవసాయ చట్టం కోసం చేయని పోరాటం లేదన్నారు. తాజాగా పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభానికి ముందు రోజు జరిగిన అఖిల పక్ష సమావేశం లో కూడా రైతు చట్టాల గురించి పార్లమెంటులో చర్చించాలని కేంద్రాన్ని కోరిన సంగతిని గుర్తు చేశారు.రైతుకు గిట్టుబాటు ధరకు సంబంధించిన చట్టం పై కూడా ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే చర్చించాలని కూడా తాను కోరినట్లు నామ నాగేశ్వరరావు ఈ సందర్భంగా తెలిపారు.



వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని. రోజుకు 600 రూపాయలు చొప్పున కూలి ఇవ్వాలని, కేంద్ర బడ్జెట్లో 2,50,000 కోట్ల నిధులు కేటాయించాలని. ఉపాధి పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని, దళిత గిరిజన పై జరుగుతున్న దాడులని నివారించాలని, దేశంలో ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులును భర్తీ చేయాలని. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని తదితర సమస్యలపై ఈ సందర్భంగా ఎంపీ నామ నాగేశ్వరరావు కు వినతిపత్రం అందజేయగా ఎంపీ నామ సానుకూలంగా స్పందించి, వారికి భరోసా ఇచ్చారు. ఎంపీ నామ ను కలిసిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘంతో పాటు కెవిపిఎస్ నాయకులు మెరుగు సత్యనారాయణ, యర్రా శ్రీనివాసరావు, నందిపాటి మనోహర్, సాగర్, కెవి రెడ్డి, తేలపోలు రాధాకృష్ణ, కే లక్ష్మణరావు, వేణు, బంధం శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

# రాజధానిలోనూ శీనన్న మార్క్

- పొంగులేటి పేరెత్తగానే కేరింతలు...
- మంత్రిగా ప్రమాణ స్వీకారోత్సవంలో దద్దరిల్లిన ఎల్బీ స్టేడియం
- తెలంగాణ మూడో అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి కేబినెట్‌లో శ్రీనివాసరెడ్డికి చోటు

హైదరాబాద్ బ్యూరో, కెరటం న్యూస్

తెలంగాణ మూడో శాసనసభ ముఖ్యమంత్రి, మంత్రివర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేరెత్తగానే వేదిక కేరింతలతో హోరెత్తింది. హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో



తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేరెత్తగానే ఎల్బీ స్టేడియం ఒక్కసారిగా కేరింతలతో దద్దరిల్లింది. గవర్నర్ తమిళిసై రాష్ట్ర మంత్రిగా ప్రమాణం చేయించిన వెంటనే పొంగులేటి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. గవర్నర్ కు కృతజ్ఞతలు తెలిపిన అనంతరం నేరుగా వెళ్లి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీలతో పాటు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు పొంగులేటి అభివాదం చేసి...ఆశీర్వాదం తీసుకున్నారు.

# చిత్తారు శ్రీహరి యాదవ్‌కు ఘన నివాళి

ఖమ్మం టౌన్, కెరటం న్యూస్

చిత్తారు శ్రీహరి యాదవ్ ప్రజల మనిషి అని, ఎన్నో సామాజిక కార్యక్రమాలతో ప్రజల మనసును గెల్చుకున్నారని పలువురు వక్తలు ఘనంగా నివాలర్పించారు. అఖిల భారత యాదవ్ మహాసభ ఆధ్వర్యంలో స్థానిక చిత్తారు శ్రీహరి యాదవ్ జిల్లా కార్యాలయంలో గురువారం చిత్తారు శ్రీహరి యాదవ్ 12వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు చిత్తారు సింహాద్రి యాదవ్ మాట్లాడుతూ శ్రీహరి యాదవ్ యాదవ్ సంఘ పటిష్టానికి, సంఘ పురోభివృద్ధి కి శ్రమిస్తూ అసువులు భాశారని నివాలర్పించారు. ఆయన లేని లోటు ఎంతగానో కనిపిస్తుందని, ఆయన స్పూర్తితో ముందుకు పోవాలన్నారు. అంతకముందు శ్రీహరి యాదవ్ చిత్ర పటానికి పూలమాల వేసి, శ్రద్ధాంజలి ఘటించి, నివాలర్పించారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ్ మహాసభ ఖమ్మం జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య యాదవ్, అఖిల భారత యూత్ అధ్యక్షుడు చిత్తారు సింహాద్రి యాదవ్, గొర్రెల పెంపకం దారుల ఖమ్మం జిల్లా అధ్యక్షులు చింతలచెరువు కోటేశ్వరరావు, యాదవ్, పొదుల సతీష్ యాదవ్ , తెల్లబోయిన రమణ యాదవ్, పొదిల తిరుపతిరావు, కన్నబోయిన రవి యాదవ్ , ఎల్ఐసి శ్రీను, భూపతి యాదవ్, మండే శ్రీనివాస్ యాదవ్, వాకధాని విజయ్ , వాకధాని రఘుపతి యాదవ్, పంకు మురళి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





## మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి శెట్టి ఆధ్వర్యంలో మంత్రులు తుమ్మల, పొంగులేటిలను కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్

కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శి శెట్టి రంగారావు ఆధ్వర్యంలో ఖమ్మం 58 వ డివిజన్ కు చెందిన పార్టీ నాయకులు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేబినెట్ లో గురువారం తుమ్మల, పొంగులేటిలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం శెట్టి రంగారావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కల్లూరి సోమనాథం, సముద్రాల శ్రీనివాసరావు, ఎమ్మని వీరభద్రం, నల్లమల వేణు, వాలబోయిన వెంకటేశ్వర్లు,సుధాకర్,రాజా,ఉపేందర్ రెడ్డి,అల్లం శ్రీనివాస్ రెడ్డి తదితరులు కలిశారు.ఈ సందర్భంగా వారు మంత్రులకు పుష్పగుచ్ఛాలిచ్చి శాలువాలతో సత్కారం చేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.






## తుఫాను వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

### - అఖిలభారత రైతు కూలి సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి వై.ప్రకాష్

కారేపల్లి, కెరటం న్యూస్ ప్రతినిధి

గత నాలుగు రోజులుగా తుఫాను మూలంగా కురుస్తున్న వర్షాల మూలంగా జిల్లాలో వేలాది ఎకరాలలో వరి మిర్చి పత్తి మొక్కజొన్న తదితర పంటలు రైతులకు చేతికి వచ్చే టైం లో పూర్తిగా తడిసి దెబ్బతిన్నాయి దీని మూలంగా లక్షలాది రూపాయల పెట్టుబడులు పెట్టి రైతాంగం నష్టపోయి నారు ఈరోజు సింగరేణి మండలం పేరుపల్లి గ్రామంలో నష్టపోయిన రైతులను గుర్తించి నష్టపరిహారం చెల్లించాలని పంట నష్టం సర్వే చేపట్టాలని మిర్చికి ఒక లక్ష వరి పత్తి మొక్కజొన్న వివిధ రకాల పంటలకు ఎకరాకు 50 వేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ మండల నాయకులు కే శ్రీనివాసరెడ్డి అలం చంద్రయ్య గురవయ్య వై జానకి సంపత్ సుగుణ వెంకన్న బైరవల్ల లక్ష్మయ్య మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



# నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు..

- ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్

తెలంగాణ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎనుముల రేవంత్ రెడ్డి కి మరియు వారి మంత్రివర్గ సహచరులకు ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రిగా మల్లు భట్టి విక్రమార్క, మంత్రులుగా తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం జిల్లా నుండి ప్రాతినిధ్యం పొందడం సంతోషకరమైన విషయమని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. వారికి తన తరపున, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ తరపున శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని తాతా మధుసూదన్ పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకుంటూ ఈ జిల్లా సమగ్ర అభివృద్ధికి ముగ్గురు మంత్రులు కృషి చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.



# మండలంలో వరి పంట వర్షార్పణం

కారేపల్లి, కెరటం న్యూస్ ప్రతినిధి

కారేపల్లి మండలంలో చేతికి వచ్చి వరి పంట వర్పాణం కావటంతో రైతులు పడుతున్న వేదన వర్ణాతీతంగా మారింది. మూడు రోజులు తుఫాన్‌తో పోలంలోని వరి తడిసి ముద్దై చేతికి రాని పరిస్థితి ఉంది. పోలం నుండి నీటిని తొలగించటానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. చీమలవారిగూడెంలో రైతు అడ్డగోడ ఐలయ్య పోలంలో నీరు నిల్వ ఉండి వరి మెదలు మునిగి పోయిఉన్నాయి. కోసిన వరి మెదలు పోలంనుండి బయటకు తీసినా ధాన్యం రంగుమారటం, మొలకెత్తుతున్నాయని రైతు ఐలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. చీమలపాడు ప్రాంతంలో ఈదురు గాలులు, తుఫాను తాకిడికి వరి కంకులు విరిగి నేలపాల్కెనాయి. పంట నేలపాల్కెనా రైతులను ఆదుకోవాలని గిరిజన రైతు ఎరిపోతు భద్రయ్య ప్రభుత్వాన్ని అర్జిస్తున్నారు.

## తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వచ్చింది..

# దొరల పాలన అంతమైంది

- అందరం సమిష్టిగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం
- రాష్ట్ర సంపద, వనరులు ప్రజలకు పంచుతాం
- సోనియాగాంధీ తెలంగాణ లక్ష్యాలు నెరవేర్చడమే మా ప్రభుత్వ బాధ్యత
- మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క





హైదరాబాద్ బ్యూరో, కెరటం న్యూస్

తెలంగాణలో దొరల పాలన అంతమై ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని, నేటితో ఇందిరమ్మ పాలన మొదలవుతుందని, అందరం సమిష్టిగా పనిచేసి ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ఎల్బి స్టేడియంలో ప్రమాణ స్వీకార మహోత్సవం తర్వాత కలిసిన మీడియాతో ఆయన మాట్లాడారు. పది సంవత్సరాల నియంతృత్వ పరిపాలన నేటితో అంతమైందని. ప్రజలు నిరీక్షిస్తున్న ప్రజాస్వామ్య పరిపాలన ప్రారంభమవుతుందని, ప్రజల ఆశలు, ఆశయాలు, ఆకాంక్షలు, ఆత్మగౌరవం నెరవేరాలని ఎన్నికల్లో అద్భుతమైన చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చి కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ఇచ్చిన తెలంగాణ ప్రజల ఆకాంక్షల నెరవేర్చడానికి నేటి నుంచి కంకణ భద్దులమై పని చేస్తామని చెప్పారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు పాదయాత్ర చేసిన సందర్భంగా అన్ని వర్గాల ప్రజలు తనను కలిశారని వారి సమస్యలు నేను విన్నానని ఆ సమస్యల పరిష్కారం మార్గమే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు తెచ్చిందన్నారు. ప్రజలు పడుతున్న ప్రతి సమస్య పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ అభయహస్తం మేనిఫెస్టో తీసుకొచ్చిందని వెల్లడించారు. పీపుల్స్ ప్రభుత్వంలో ప్రజల సంపద ప్రజలకు పంచడానికి కచ్చితంగా ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. నిరుద్యోగులకు మహిళలకు ఇల్లు లేని నిరుపేదలకు రైతులకు ఇచ్చిన హామీలను వారి ఆకాంక్షలను నెరవేర్చుతామన్నారు. రాష్ట్ర సంపద వనరులు ప్రజలకు పంచబడాలన్నారు. ప్రభుత్వంలోని ప్రతి వ్యవస్థ ప్రజలకు మాత్రమే ఉపయోగపడాలని ఆ దిశగా తమ పరిపాలన ఉంటుందని వివరించారు. పాలకులు, అధికారులు ప్రజలకు సేవకులుగా పనిచేయాలని, ఆ లక్ష్యంతో ఇక నుంచి మా పరిపాలనకు అడుగులు ముందుకు పడతాయని వివరించారు. సమిష్టిగా నిర్ణయాలు తీసుకొని టీం వర్క్ గా పనిచేసి ప్రజల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని వెల్లడించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తాం: టీఎన్జీవో

ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్

నూతనంగా ఏర్పడనున్న రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీవో) ఖమ్మం జిల్లా శాఖ అభినందనలు తెలిపింది. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం పట్ల హర్షం వ్యక్తంచేస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు షేక్.అఫ్జల్ హసన్,ఆర్.వి.ఎస్. సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. పది లక్షల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల కుటుంబాల ఆకాంక్షల మేరకు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామన్నారు. ఖమ్మం జిల్లాకు ఉప ముఖ్యమంత్రి మరియు రెండు కాబినెట్ మంత్రి పదవులు కేటాయించడం,పట్ల నూతనంగా సీఎం గా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డికి టీఎన్జీఓ ఖమ్మం జిల్లా పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లాకు చెందిన ముగ్గురికి క్యాబినెట్ లో స్థానం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భట్టివిక్రమార్క కి డిప్యూటీ సీఎం గా రెవెన్యూ శాఖలను తుమ్మల నాగేశ్వరరావుకి రోడ్లు భవనాల శాఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి నీటిపారుదల శాఖల కు మంత్రులుగా బాధ్యతలు అప్పజెప్పడం హర్షదాయకం అన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి కోసం, సంక్షేమ పథకాల అమలు కోసం ఉద్యోగులుగా ప్రభుత్వంతో కలిసి సమన్వయం చేసుకుని ముందుకెళతామన్నారు. ఉద్యోగుల ఆకాంక్షల మేరకు నూతన ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పలు అనుకూల నిర్ణయాలను ప్రకటించిందని, ఆయా మ్యానిఫెస్టో అమలుకోసం, ప్రభుత్వానికి అండగా ఉంటామన్నారు. నూతన ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయటంలో ప్రభుత్వ ఉద్యోగులుగా ముందుంటామని టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు షేక్.అఫ్జల్ హసన్ కార్యదర్శి ఆర్ వీ ఎస్ సాగర్ తెలిపారు.

**నేడు ప్రభుత్వ కార్యాలయాల్లో టీఎన్జీఓస్ సంబరాలు...:** నేడు ఉదయం జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయిన సందర్భంగా సంబురాలు జరపాలని టీఎన్జీఓ శాఖ పిలుపునిచ్చింది. ఐడిఓసి లో 11:30 నిమిషాలకు జరిగే సంబురాలకు ఉద్యోగులందరూ సకాలంలో హాజరుకావాలని కోరింది.



# రేపు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమావేశం హాజరుకానున్న రాష్ట్ర నేతలు

ఖమ్మం టౌన్, కెరటం న్యూస్

ఖమ్మం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఖమ్మంజిల్లా సమావేశం ఈనెల తొమ్మిదిన శనివారం స్థానిక రిక్కాబజార్ హైస్కూల్లో జరుగుతుందని అసోసియేషన్ బాధ్యులు పరిశ పుల్లయ్య, కె. కృష్ణమూర్తి నేడొక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎ. రాజేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి ఎంవి నర్సింగరావు, ఉపాధ్యక్షులు టి. పురుషోత్తంతో పాటు పలువురు రాష్ట్ర నేతలు పాల్గొంటారని వారు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా శాఖ ఎంపిక జరుగుతుందని పుల్లయ్య, కృష్ణమూర్తి తెలిపారు.